AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM

5-8-2026 (Wednesday) | MAIN EDITION

## మెటాకు పార్లమెంటరీ ప్యానెల్ అల్టిమేటం




**అక్షరటుడే, ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ నుంచి కొంతసేపు తొలగించిన వ్యవహారంలో ఐటీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం మెటా సంస్థకు మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఆ లోపు మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనపై పార్లమెంట్ ప్యానెల్ అధ్యక్షుడు నిశికాంత్ దూబే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దుబాయిలో పేలుళ్లు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దుబాయ్‌లోని కీలక పారిశ్రామిక ప్రాంతమైన జెబెల్ అలీలో కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే ఏడు భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఓడరేవు ప్రాంతంపై దట్టమైన నల్లటి పొగ అలుముకోవడంతో యూఏఈ వ్యాప్తంగా కలకలం రేగింది. మంటలను అదుపు చేయడానికి అత్యవసర సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి.

## వడ్డీరేట్లు యథాతథం



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు చేయలేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు.

## కేంద్ర జల్‌శక్తి మంత్రితో రేవంత్ రెడ్డి భేటీ



అక్షరటుడే, ఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ ఎత్తు విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు.


## టీటీడీకి రూ.2 కోట్లు విరాళం



అక్షరటుడే, ఏపీ: హైదరాబాద్ నగరానికి చెందిన ట్రినిటీ కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బుధవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకురూ.2 కోట్లు విరాళం అందించింది. సంస్థకు చెందిన సీతారామ్ రెడ్డి, జి. కవిత, త్రినయ్ రెడ్డి, త్రిభువన్ రెడ్డి అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి డీడీలను అందజేశారు.

## హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలో ఈడీ సోదాలు కలకలం రేపాయి. రూ.3 వేల కోట్ల కుంభకోణానికి సంబంధించిన కేసులో ఈడీ అధికారులు బుధవారం ఉదయం హైదరాబాద్, విశాఖపట్నంలో సోదాలు చేశారు. వెల్ఫేర్ గ్రూప్ ఛైర్మన్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే విజయప్రసాద్ ఇంటితో పాటు కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. బీహార్‌కు చెందిన అధికారులు ఏకకాలంలో ఐదు చోట్ల సోదాలు జరుపుతున్నారు. వెల్ఫేర్ గ్రూప్ ఛైర్మన్‌గా అవకతవకలకు పాల్పడినట్లు విజయప్రసాద్‌పై ఆరోపణలు ఉన్నాయి. కాగా ఆయన ప్రస్తుతం విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా కొనసాగుతున్నారు.



## శ్రీశైలం జలాశయానికి పోటెత్తిన వరద

**అక్షరటుడే, శ్రీశైలం :** శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తింది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండాయి. దీంతో జూరాల మీదుగా శ్రీశైలానికి వరద కొనసాగుతోంది. జూరాలకు 2,44,000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, అక్కడి నుండి జలవిద్యుత్ ఉత్పత్తి, 33 స్పిల్‌వే గేట్ల ద్వారా 2,45,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆ నీరు శ్రీశైలానికి చేరుతోంది. శ్రీశైలం నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నిల్వ 118 టీఎంసీలకు చేరింది.

జూనియర్ కాలేజీల అనుమతుల కోసం ఏకంగా హైడ్రా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. నకిలీ ఫైర్ ఎన్‌వోసీలను తయారు చేసి ఇంటర్ బోర్డుకు దరఖాస్తులు చేశారు. ఈ వ్యవహారం అధికారుల దృష్టికి రావడంతో చర్యలు చేపట్టారు. ఫోర్జరీ సంతకాలతో పత్రాలు సృష్టించిన 8 కాలేజీలపై కేసులు నమోదు చేశారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి




# హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

- నకిలీ ఫైర్ ఎన్‌వోసీల తయారు
- ప్రైవేట్ జూనియర్ కాలేజీల నిర్వాకం
- 8 కళాశాలలపై కేసులు నమోదు

ఇంటర్ కాలేజీలకు అనుమతుల కోసం ఫైర్ ఎన్‌వోసీ సమర్పించాల్సి ఉంటుంది. అయితే పలు కాలేజీలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకున్నా.. హైడ్రా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీలను సృష్టించాయి. వాటి ద్వారా దరఖాస్తు చేసి అనుమతులు సంపాదించాయి. హైడ్రా ఫైర్ ఎన్‌ఓసీలపై సాధారణ తనిఖీని నిర్వహించగా, నకిలీ పత్రాల దందా బయటపడింది. ఎనిమిది జూనియర్ కళాశాలలు అనుబంధ గుర్తింపులు, కార్యకలాపాల అనుమతులు పొందడం కోసం నకిలీ భద్రతా ధృవపత్రాలను సమర్పించాయి. ఈ విషయాలు వెలుగులోకి రావడంతో, హైదరాబాద్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆ కళాశాలలపైనా, ధృవపత్రాల తయారీ వెనుక ఉన్న వారిపైనా దర్యాప్తు ప్రారంభించారు.

### తీగ లాగితే..

బర్కత్‌పురాలోని హైందవీ జూనియర్ కళాశాల నకిలీ ఫైర్ ఎన్‌ఓసీని సమర్పించిందని ఫిబ్రవరి 26న హైడ్రాకు ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు తనిఖీ చేయగా.. కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఇంకా ఇలాంటి నకిలీ పత్రాలు ఉన్నాయేమోనని సోదాలు చేపట్టగా అసలు విషయం బయటపడింది. హైడ్రా అభ్యర్థన మేరకు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాధికారులు ధృవీకరణ కోసం 76 ఫైర్ ఎన్‌ఓసీలను సమర్పించారు. వాటిని పరిశీలించిన అధికారులు ఎనిమిది సర్టిఫికెట్లు నకిలీవని, వాటిపై నకిలీ రిఫరెన్స్ నంబర్లు ఉన్నాయని తేల్చారు.

### అనుమతులు రద్దు చేయాలి

నకిలీ సర్టిఫికెట్లను సమర్పించిన కళాశాలలకు మంజూరు చేసిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ హైడ్రా సంబంధిత జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులకు లేఖ రాసింది. నకిలీ సర్టిఫికెట్లు నిజమైన ప్రభుత్వజారీ చేసిన పత్రాలుగా కనిపించేలా రూపొందించబడ్డాయని, అందువల్ల ఈ ఆరోపణ ప్రజా భద్రతకు సంబంధించిన తీవ్రమైన ఫోర్జరీ కేసుగా పరిగణించబడుతుందని హైడ్రా అధికారులు తెలిపారు. హైడ్రా అదనపు డైరెక్టర్ పాపయ్య వర్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, లేక్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది.

### ఆ కాలేజీలు

మొత్తం 8 కాలేజీలు నకిలీ ఎన్‌వోసీలను సమర్పించాయి. అవి హైందవీ జూనియర్ కాలేజీ (బర్కత్‌పుర), రెసోనెన్స్ జూనియర్ కాలేజీ (SR నగర్), ప్రియాంక జూనియర్ కాలేజీ (మెహిదీపట్నం), మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజీ (విద్యానగర్), శ్రీచైతన్య జూనియర్ కాలేజీ (చంద్రాయణగుట్ట), న్యూ ఎరా జూనియర్ కాలేజీ (చిక్కడపల్లి), షాహీన్ జూనియర్ కాలేజీ (శివరాంపల్లి), వశిష్ట జూనియర్ కాలేజీ (తెల్లాపూర్). ఈ కాలేజీలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## రాహుల్ గాంధీతో కిరణ్ రిజిజు భేటీ



**అక్షరటుడే, న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మూడో వారంలోనూ వాయిదాల పర్వంతో కొనసాగుతున్నాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్షాలు నినాదాలు చేస్తుండటంతో ఉభయ సభలు పదే పదే వాయిదా పడుతున్నాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ప్రాంగణంలోని రాహుల్ గాంధీ చాంబర్‌లో జరిగిన ఈ భేటీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. సభలు సజావుగా సాగేలా సహకరించాలని కోరేందుకు నిర్వహించిన ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఇక అన్ని ఎరువులు యాప్‌లో బుక్ చేయాల్సిందే..



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఇక నుంచి ఎరువులు కొనుగోలు చేయాలంటే యాప్ ద్వారానే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం ఈ నెల 6 నుంచి అమలులోకి రానుంది. తెలంగాణలో ప్రస్తుతం యూరియా బుకింగ్ యాప్ ద్వారా సాగుతోంది. డీఏపీ, ఎన్‌పీకే, ఎంవోపీ తదితర ఎరువులను సైతం ఇక నుంచి యాప్‌లోనే బుక్ చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అన్ని ఎరువుల బుకింగ్ కోసం ప్రభుత్వం కొత్త యాప్ తీసుకొచ్చింది. ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (FFS) యాప్ ఇక అన్ని ఎరువులను బుక్ చేసుకోవాలి. యూరియా, ఎన్‌పీకే, డీఏపీ, పోటాష్ (ఎంవోపీ) ఎరువులను దీని ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఎరువుల బుకింగ్ కోసం రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోని రైతులు ఏఈవోలను సంప్రదించాలి. రిజిస్ట్రేషన్ అయ్యాక ఒక ఐడీ వస్తుంది. మీ సేవ కేంద్రాల్లో కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

## ఎర్ర సముద్రంలో భారత నౌకపై దాడి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** యెమెన్ పశ్చిమ తీరంలోని ఎర్ర సముద్రంలో ఒక క్షిపణి దాడికి గురైన భారత జెండా కలిగిన సరుకు రవాణా నౌక బోల్తా పడి మునిగిపోయింది. ఆ నౌకలో 14 మంది సిబ్బంది ఉండగా, వారిలో 13 మంది భారతీయ నావికులు, ఒకరు యెమెన్ దేశస్థుడు. 14 మంది నావికులను యెమెన్ బలగాలు రక్షించాయి. హౌతీల ఆధీనంలో ఉన్న హోడెయిడా ఓడరేవు నగరానికి దక్షిణంగా సుమారు 13 నాటికల్ మైళ్ల దూరంలో ఎంఎస్‌వి ఫైజ్ నూరే ఓలియా అనే నౌకపై దాడి జరిగింది. యెమెన్ జలాల సమీపంలో నౌకపై జరిగిన దాడిని భారత్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది.



## తెలంగాణకు అన్యాయం చేసే కుట్ర : హరీశ్‌రావు




**అక్షరటుడే, హైదరాబాద్ :** గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిందని అన్నారు. ఆ ప్రతిపాదనను జీఆర్‌ఎంబీ ఎజెండాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయాలని ఏపీ కోరిందన్నారు. జీఆర్‌ఎంబీలో రెండు రాష్ట్రాల ఇంజినీర్లు ఉంటారని చెప్పారు. ఈ ఎజెండా తయారు అవుతుంటే తెలంగాణ ఇంజినీర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

## విద్యార్థుల నిరసనలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** శాంతియుత నిరసనలు తెలిపే యువ విద్యార్థుల పట్ల అధికారులు, భద్రతా దళాలు అత్యంత సంయమనం పాటించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. హింసను అదుపు చేసేందుకు బలగాలతో హింసాత్మకంగా ప్రతిస్పందించడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతుందని అత్యున్నత ధర్మాసనం అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన నిరసనల సమయంలో జరిగిన రాళ్లదాడి, హింసాత్మక ఘటనలపై దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ కోర్టు ఈ స్పష్టతనిచ్చింది.

## భారీ బ్యాటరీతో పోకో ఫోన్ విడుదల




**అక్షరటుడే, ఫీచర్స్‌డెస్క్:** చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీ పోకో.. భారత మార్కెట్‌లో మరో కొత్త మోడల్ విడుదల చేసింది. పోకో ఎం8 పవర్ 5 జీ పేరుతో తీసుకువచ్చిన ఈ ఫోన్‌లో అధునాతన ప్రాసెసర్, భారీ బ్యాటరీ అమర్చారు. ఈ స్మార్ట్ ఫోన్ ఫస్ట్ సేల్ ఆగస్ట్ 7 ప్రారంభం కానుంది. ఫ్లిప్ కార్ట్‌తో పాటు పోకో ఇండియా వెబ్ సైట్‌లో అందుబాటులో ఉండనుంది.

## జార్ఖండ్‌లో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన

**అక్షరటుడే, జార్ఖండ్:** జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. జేపీఎస్సీ, జేఎస్‌ఎస్‌సీ, సీజీఎల్ ఇతర పోటీ పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ.. జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో నిరాహార దీక్ష చేస్తున్నారు. మహతోతో బుధవారం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల ఉద్యమానికి కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు తెలిపింది. బుధవారం అభిజిత్ దీప్కే మీడియాతో మాట్లాడారు. ఖచ్చితంగా తాము జార్ఖండ్‌కు వెళ్తామని, అక్కడ నిరసన తెలుపుతున్న విద్యార్థులకు అండగా ఉంటామని ప్రకటించారు.

